ఎర్రవల్లిలోని వ్యవసాయక్షేత్రంలో తనను కలిసిన శ్రీనివాస్‌రెడ్డి కుటుంబ సభ్యులతో బీఆర్ఎస్ అధినేత కేసీఆర్, సతీమణి శోభ



కారు వద్దకు వచ్చి శ్రీనివాస్‌రెడ్డికి ఆత్మీయ వీడ్కోలు పలుకుతున్న బీఆర్ఎస్ అధినేత కేసీఆర్

ఆత్మబంధువుకు ఆత్మీయ వీడ్కోలు

> తెలంగాణ అంటే ఆత్మీయత. తిన్నా తినకపోయినా, కలిసి తిరిగినా, దోస్తానా చేసినా.. మనుషుల నడుమ ప్రేమానురాగాలు, ఆప్యాయతలు అల్లుకుపోతాయి. మానవ సంబంధాలకు అడ్డా... తెలంగాణ గడ్డ. మనిషితోనే కాకుండా మనసుతోనూ పెనవేసుకున్న బంధాలు ఇక్కడ కోకొల్లలు. కష్టమైనా.. సుఖమైనా మనసులో మాటను దాచుకోకుండా ఉన్నది ఉన్నట్టు బయటపెట్టేడం ఇక్కడి అలవాటు. మన చేతి కింద పనిచేసే వ్యక్తిని ఇంట్ల మనిషి లెక్కనే ప్రేమిస్తది తెలంగాణ. వరుసలు కలిపి అల్లుకుపోయే ఆత్మీయ బంధాలు అడుగడుగునా కనిపిస్తాయి. తరతరాలుగా తారతమ్యాలకు అతీతంగా వసుధైక కుటుంబంగా కలిపి ఉంచే మానవ సంబంధాలు ప్రపంచంలో తెలంగాణకే ప్రత్యేకం. అటువంటి మానవీయ సంబంధానికి కేరాఫ్ కేసీఆర్.

> తెలంగాణను సాధించిన మహా ఉద్యమ సారథి ఆయన. వందేండ్ల ఆకాంక్షలను నిజం చేసి పదేండ్ల పాటు తెలంగాణను ప్రగతి పథంలో నిలిపి దేశానికే గర్వకారణంగా నిలిచిన ముఖ్యమంత్రి. ఆయన వ్యక్తిత్వం మహోన్నతం. ఆయనో మహా మనీషి. 'మన ఇంట్ల మనిషి కేసీఆర్'గా ప్రతి తెలంగాణ బిడ్డ భావిస్తుంది. విశాల వ్యక్తిత్వం కేసీఆర్ సొంతం. సామాన్యుల గుండెల్లో నిలిచిన అతిసామాన్యుడు.. అలుముకున్న బంధాల కలబోత కేసీఆర్.

మొదటిపేజీ తరువాయి...

పరిణామాల కలబోత ఇది. తన సన్నిహితుడు తనను వీడిపోతున్న సున్నితమైన సందర్భంలో అతి సున్నితమైన కేసీఆర్ మనసు చలించిపోయింది. 'శీనన్నా' అని పిలుచుకునే తన ఆత్మీయ మిత్రుడు దూరమైతున్నడని తెలిసి కేసీఆర్ ఒకింత రందిపడ్డారు. తాను పుట్టి పెరిగిన నేలను, కేసీఆర్ ఉద్యమంతో కలిసి నడిచి సాధించుకున్న తెలంగాణ రాష్ట్రాన్ని, తన దేశాన్ని, తన బంధువులను, మిత్రులను, అభిమానులను మరీ ముఖ్యంగా తన ఆత్మబంధువు కేసీఆర్‌ను విడిచి వెళ్లాల్సి వస్తుండటంతో శ్రీనివాస్‌రెడ్డి మనసు బరువెక్కింది.

ప్రేమాక్షరబంధం కేసీఆర్

వేలమంది పార్టీ నాయకుల్లో ఒకరైన శ్రీనివాస్‌రెడ్డి పట్ల కేసీఆర్‌కు ఎందుకింత అనురాగం? అనుబంధం? ఆప్యాయత? తన పార్టీ కార్యాలయ ఇన్‌చార్జి పట్ల అంతగా గౌరవమర్యాదలివ్వడానికి కారణం ఏమిటి? ఇప్పుడివే ప్రశ్నలు అందరిలోనూ. కేసీఆర్ ప్రేమాప్యాయతలకు బోల్డన్ని ఉదాహరణలున్నాయి. పార్టీ కార్యకర్తలు, నాయకుల కోణంలో ఈ బంధం ప్రత్యేకమైనది. అపురూపమైనది. ఈ సందర్భంగా శ్రీనివాస్‌రెడ్డితో తనకున్న బంధాన్ని కేసీఆర్ నెమరు వేసుకున్నారు. అది ఆయన మాటల్లోనే..

చెక్కుచెదరని సంకల్పం శీనన్నది

'చూస్తే అట్లవుపడుతడుగానీ, శీనన్న (ప్రొఫెసర్ శ్రీనివాస్‌రెడ్డి) గొప్పోడు. చిన్నతనం నుంచే తెలంగాణ వాది. 1969 నాటి తెలంగాణ ఉద్యమంలో కావచ్చు. 2001లో నేను ప్రారంభించిన మలిదశ తెలంగాణ ఉద్యమంలో కావచ్చు, పూర్తి అంకితభావంతో తెలంగాణ కోసం తన్లాడిన వ్యక్తి. విద్యార్థి దశలో వెటర్నరీ కాలేజీలో చదువుతున్నప్పుడు కాలేజీ ప్రెసిడెంట్‌గా 69 నాటి ఉద్యమంలో క్రియాశీలకంగా పాల్గొన్నడు. తెలంగాణ కోసం జైలుకు పోయిన శ్రీనివాస్‌రెడ్డి, నాటి ఉద్యమం సఫలం కాకపోయినా మొక్కవోని ధైర్యంతో వారి పోరాట పటిమ చెక్కు చెదరని వ్వలేదు. ఆ ఉద్యమంలో విజయం సాధించలేదనే నిరాశకు లోను కాకుండా, భంగపాటుకు గురికాకుండా, భయపడకుండా తెలంగాణ కోసం పట్టుదలతో పనిచేసిండు. ఉద్యమ ఆకాంక్షను సంపుకోకుండా ఎటువంటి ప్రలోభాలకు లొంగకుండా తెలంగాణ రాష్ట్ర సాధన కోసం తన వాదనలను వినిపిస్తూ, ఆలోచనలను, కార్యాచరణను కొనసాగించిండు శ్రీనివాసరెడ్డి. తన మిత్రులు సహచరులతో నిత్యం తెలంగాణ కోసం చర్చలు చేస్తూ తెలంగాణ వ్యతిరేకులతో వాదనలు చేస్తూ తెలంగాణ రాష్ట్రం ఆవశ్యకతను తెలియచేస్తూ భావజాల వ్యాప్తి కోసం దశాబ్దాల కాలం తనవంతు కృషి చేసిండు. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు జరగాల్సిందేననే కృత నిశ్చయంతో తన ప్రయాణాన్ని సాగించిండు.

మాది 25 ఏండ్ల తెలంగాణ బంధం

2001లో టీఆర్ఎస్ పార్టీని స్థాపించిన ప్రారంభ దశలో నన్ను కలిసిన నాటినుంచి పార్టీకోసం అంకితభావంతో పనిచేసి గులాబీ జెండాను ఎగరేసిన పార్టీ వీరాభిమాని శ్రీనివాసరెడ్డి. నాటి నుంచి పార్టీ ప్రధాన కార్యదర్శిగా కేంద్ర కార్యాలయం తెలంగాణ భవన్ కార్యదర్శిగా, అద్భుతమైన రీతిలో బాధ్యతలను నిర్వర్తించారు. దాదాపు 25 ఏండ్ల పాటు అంకిత భావంతో పట్టుదలతో పనిచేశారు. తెలంగాణ భవన్ నిర్మాణం జరిగినన్ని రోజులు నాతో పాటే ఉంటూ అత్యంత బాధ్యతతో వ్యవహరించెటోడు. తెలంగాణ నలుమూలల నుంచి జిల్లాల నుంచి తెలంగాణ భవన్‌కు వచ్చే కార్యకర్తలను, పార్టీ నాయకులను ఓపికతో పలుకరిస్తూ వారి కష్టసుఖాలు తెలుసుకుని, ఆప్యాయత కనబరిచిన గొప్పగుణం శ్రీనివాస్‌రెడ్డిది. వారికి పార్టీ శ్రేణుల్లో ప్రత్యేక గౌరవమున్నది. ముఖ్యంగా పార్టీ ఎదుర్కొన్న క్లిష్ట సమయాల్లో ఒక పెద్దమనిషిగా శ్రీనివాసరెడ్డి కనబరిచిన చొరవ నన్నెంతో ఆకట్టుకునేది. కష్ట సమయాల్లో తెల్లారకముందే ఇంటికి వచ్చి నాతో పాటు కూసునేటోడు. 'గాదానికి ఆలోచనెందు కన్నా..గదేమయిద్దే యేంగాదు' అని నాకు ధైర్యాన్నిచ్చేటోడు. అవసరమైతే ఇంటికి పోకుండా, నాలుగైదు రోజులపాటు నాతోనే ఉండేటోడు. నాతోనే కూసునేటోడు. తెలంగాణ సాధన అనివార్యం. 'నీతోకాకుంటే తెలంగాణ రాదు' అని స్పష్టంగా చెప్పి నాకు భరోసాగా మాట్లాడేటోడు. నాతో పాటు ఇతర నాయకులకూ ధైర్యం చెప్పేటోడు. అదీ శ్రీనివాసరెడ్డి గొప్పతనం. ఆయనకు ఇప్పుడు 85 ఏండ్ల వయసు వచ్చినా ఇంకా పార్టీకోసం, తెలంగాణ కోసం పనిచేస్తూనే ఉండడం గొప్ప విషయం.

విత్ లవ్ ఫ్రమ్ కేసీఆర్

హోదాతో నిమిత్తం లేకుండా తనతో పాటు 25 ఏండ్లు అవిశ్రాంతంగా కలిసి పనిచేసిన శ్రీనివాసరెడ్డిని ఎర్రవల్లి నివాసంలో బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ఘనంగా సత్కరించారు. కేసీఆర్ ఆహ్వానం మేరకు, గురువారం మధ్యాహ్నం ఎర్రవెల్లి నివాసానికి శ్రీనివాస్‌రెడ్డి దంపతులను వారి కుమారుడు, కూతురు చేరుకున్నారు. వారికి మధ్యాహ్న భోజనంతో కేసీఆర్ ఘనంగా ఆతిథ్యమిచ్చారు. మనసువిప్పి చాలాసేపు ముచ్చటించారు. ఉద్యమ కాలం నుంచి నేటి వరకు కలిసి సాగిన వారి ప్రయాణాన్ని ఇరువురూ నెమరువేసుకున్నారు. ఎదుర్కొన్న కష్ట సుఖాలను ఒడిదొడుకులను గుర్తు చేసుకున్నారు. లంచ్ తర్వాత శ్రీవాస్‌రెడ్డి దంపతులను కేసీఆర్–శోభమ్మ దంపతులు సంప్రదాయ పద్ధతిలో శాలువా కప్పి ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్‌రెడ్డి మెడకు కేసీఆర్ లాకెట్ తొడిగారు. ఊహించని రీతిలో జరుగుతున్న సత్కారాన్ని చూసి 'అన్నా.. ఎందుకే గివన్నీ' అని శ్రీనివాసరెడ్డి అంటుంటే వారించిన కేసీఆర్ 'అన్నా ఇది నీకు ప్రేమతో చేయించిన లాకెట్.. అండ్ల 'విత్ లవ్ ఫ్రమ్ కేసీఆర్' అని రాసివుంటది సూస్కో' అని అనగానే నవ్వులు విరిశాయి. సత్కార కార్యక్రమం అనంతరం కేసీఆర్ దంపతులు కారు దాకా వచ్చి శ్రీనివాసరెడ్డి దంపతులకు ఆత్మీయంగా వీడ్కోలు పలికారు.

కేసీఆర్‌ను, తెలంగాణను వీడి వెళుతున్నందుకు బాధగా ఉంది

ఇది కేవలం తనకు జరిగిన సత్కారం మాత్రమే కాదని, తనలాంటి ఎందరో తెలంగాణ వాదులకు జరిగిన సత్కారమని ప్రొఫెసర్ శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. తెలంగాణ జాతిని మేల్కొల్పిన ఉద్యమ రథ సారథి, తెలంగాణ ప్రగతి ప్రధాత కేసీఆర్ అని కొనియాడారు. వారి వద్ద 25 ఎండ్లపాటు పనిచేయడం తనకు దక్కిన అదృష్టం, గొప్ప అవకాశం అని పేర్కొన్నారు. కేసీఆర్ లేకుంటే తెలంగాణ రాష్ట్రం రాకపోయేదని, తెలంగాణ కోసం జీవితాన్ని అర్పించిన త్యాగశీలి కేసీఆర్ అని కొనియాడారు. ఆత్మీయతకు ఆప్యాయతకు నిలువుటద్దం కేసీఆర్ అని, కేసీఆర్ లాగా ప్రజల పట్ల అంతగా నెనరున్న జననేత మరెక్కడా కానరాడని ప్రశంసించారు. తెలంగాణ ప్రజల హృదయాల్లో కేసీఆర్ స్థానం శాశ్వతంగా ఉంటుందని శ్రీనివాస్‌రెడ్డి స్పష్టం చేశారు. 'నన్ను కుటుంబ సమేతంగా ఆదరించి, బట్టలుపెట్టి 'ప్రేమతో మీ కేసీఆర్' (విత్ లవ్ ఫ్రమ్ కేసీఆర్) అని నాకు లాకెట్ వేయడం జీవితంలో మరచిపోలేని సన్నివేశం. ఈ గుర్తింపు నాలాంటి సామాన్య తెలంగాణ వాదులందిరికీ దక్కిన గౌరవంగా భావిస్తున్నానని పేర్కొన్నారు. తెలంగాణ కోసం జీవితాంతం పోరాడిన తనకు అమెరికా వెళ్లి పోవడం తప్పనిసరిగా మారిందనీ, పార్టీ కార్యకర్తలను, నాయకులను, కేసీఆర్‌ను, తెలంగాణ గడ్డను వదిలి వెళుతున్నందుకు చాలా బాధగా ఉందనీ ఆవేదన వ్యక్తం చేశారు. తెలంగాణ వాదులందరి పక్షాన కేసీఆర్‌కు ధన్యవాదాలు తెలిపారు.

శీనన్న సేవలకు ఎమ్మెల్సీ పదవి

శ్రీనివాస్‌రెడ్డి కృషి, పట్టుదల, అంకితభావాన్ని దగ్గరి నుంచి చూసిన నేను వారి సేవలకు గుర్తింపుగా రాష్ట్రం వచ్చిన తర్వాత ఎమ్మెల్సీ ఇచ్చి గౌరవించుకున్న. నాటి నుంచి నేటి వరకు 'శీనన్నా' అని ఆప్యాయంగా పిలుచుకునే నా అత్యంత ఆత్మీయ మనిషి శ్రీనివాస్‌రెడ్డి. ఆయకు ఇద్దరు పిల్లలు. ఒక బిడ్డ. ఒక కొడుకు. వాళ్లు ఉద్యోగ రీత్యా అమెరికాలో స్థిరపడిపోయిండ్రు. తల్లిదండ్రులకు వయసు పెరిగిపోతున్న కారణంగా వారి బాగోగులు చూసుకోవాలని వారిని అమెరికాకు శాశ్వతంగా తీసుకుని పోతున్నరు. ఒక వయసు దాటిన తర్వాత పిల్లల ఆలోచనలను అర్థం చేసుకోవాల్సి ఉంటది కదా. అందుకని శ్రీనివాస్‌రెడ్డి దంపతులు తెలంగాణగడ్డను విడవడం ఇష్టం లేకున్నా అమెరికాకు పోవడానికి అంగీకరించిండ్రు. వాళ్లను తీసుకపోవడానికి పిల్లలిద్దరూ వచ్చిన సందర్భంలో నాకీ విషయమంతా చెప్పిండ్రు. విషయం తెలిసి నాకూ బాధగా అనిపించింది. తప్పదు కదా. కుటుంబ సభ్యుడి లాంటి శ్రీనివాసరెడ్డి నాకెంతో ఇష్టమైన సహచరుడు తెలంగాణ వీడిపోతుంటే ఘనంగా వీడ్కోలు పలకాలని 'అలయ్ బలయ్' తీసుకోవాలని అనిపించింది. వారిని ఇంటికి పిలుచుకుని వారితో భోజనం చేసి నా వంతుగా అభిమానంతో సత్కరించుకున్న. 'తెలంగాణ భవన్‌లో పార్టీ తరుపున నేతలు, కార్యకర్తలు కూడా శ్రీనివాసరెడ్డిని ఘనంగా సత్కరించుకుంటం' అంటున్నరు. పార్టీకోసం ఎంతగానో కృషి చేసిన వారిని పార్టీ కూడా ఘనంగా సత్కరించుకోవాలనుకోవడం నాకెంతో సంతోషంగా ఉంది.

కొడుకు పిలుపును గౌరవిస్తూ..

ప్రొఫెసర్ శ్రీనివాస్‌రెడ్డి కొడుకు, కూతురు దశాబ్దాల క్రితమే అమెరికాలో స్థిరపడ్డారు. ఈ నేపథ్యంలో బాధ్యత కలిగిన బిడ్డలుగా తల్లిదండ్రులను అమెరికాకు తీసుకెళ్లాలని వారు నిర్ణయించుకున్నారు. ఈ నేపథ్యంలో వారికి కూడా గ్రీన్‌కార్డు మంజూరు చేయించుకున్నారు. అనివార్య పరిస్థితుల్లో అమెరికా పౌరుడిగా మారిన శ్రీనివాస్‌రెడ్డి తెలంగాణ గడ్డను వీడి అమెరికాకు పయనం కాబోతున్నారు.

నాచారంలో వాల్యూజోన్ హైపర్ మార్కెట్‌ను ప్రారంభిస్తున్న సినీ నటుడు బాలకృష్ణ, ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి, పక్కన నిర్వాహకులు రాజమౌళి, వెంకటేశ్వర్లు, సురేశ్ తదితరులు

నాచారంలో వాల్యూజోన్ హైపర్ మార్కెట్

ప్రారంభించిన సినీ నటుడు, ఎమ్మెల్యే బాలకృష్ణ

ఉప్పల్, నవంబర్ 28: నాచారంలో ఏర్పాటు చేసిన వాల్యూజోన్ హైపర్ మార్కెట్‌ను సినీ నటుడు, హిందూపురం ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పరిస్థితులకు అనుగుణంగా వ్యాపార దృక్పథం మారుతున్నదని తెలిపారు. తెలుగు ప్రజలు అన్ని రంగాల్లో రాణిస్తున్నారని పేర్కొన్నారు. చిన్నారి నుంచి వృద్ధుల వరకు అవసరమయ్యే అన్ని రకాల ఉత్పత్తులు ఒకే దగ్గరకు తీసుకురావడం హర్షణీయమని తెలిపారు. ఫ్యాషన్, ఫన్, ఫుడ్ ఒకే ప్రాంతంలో లభించేలా చూడటం అభినందనీయమని, హైపర్ జోన్‌ను ప్రజలు ఆదరిస్తున్నారని పేర్కొన్నారు. ఫ్యాషన్, కిరాణా సరుకులు, ఫుట్‌వేర్, లగేజ్, ఫర్నిషింగ్, స్టేషనరీ, సాధారణ సరుకులతోపాటు ప్రఖ్యాతిగాంచిన ప్రపంచ, భారతీయ బ్రాండ్‌లను వినియోగదారులకు అందించడంపై దృష్టి సారించిందని తెలిపారు. అందులో భాగంగా ఒకే చోట సమగ్ర రిటైల్ షాపింగ్ అనుభవాన్ని అందించేందుకు వెంకటేశ్వర్లు, రాజమౌళి, ప్రసాదరావు, దివంగత సత్యనారాయణ ఆలోచనతో వాల్యూజోన్ ఏర్పాటు చేసినట్టు తెలిపారు. పేద విద్యార్థులకు ఆర్థిక సహాయం అందిస్తున్న ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డిని అభినందించారు. కార్యక్రమంలో ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి, కార్పొరేటర్ శాంతిసాయిజెన్ శేఖర్, టీటీడీ బోర్డు సభ్యుడు నన్నూరి నర్సిరెడ్డి, నందమూరి రామకృష్ణ, నిర్వాహకులు ఎస్ రాజమౌళి, పీ వెంకటేశ్వర్లు, ఎస్ సురేశ్ పాల్గొన్నారు.

లగచర్లకు వెళ్తున్న పీడీఎస్‌యూ నేతల అరెస్టు

పరిగి, నవంబర్ 28 : లగచర్ల రైతు కుటుంబాలను పరామర్శించేందుకు వెళ్తున్న పీడీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షుడు మహేశ్‌తో పాటు పలువురు నాయకులను గురువారం పోలీసులు పరిగిలో అరెస్టు చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా రాష్ట్ర అధ్యక్షుడు మహేశ్ మాట్లాడుతూ.. లగచర్లలో బాధితుల్లో ఎస్టీ, ఎస్సీ రైతులే అధికంగా ఉన్నారని తెలిపారు. ప్రభుత్వం ఫార్మా కంపెనీ ఆలోచనను వెనక్కి తీసుకోవాలని, బలవంతంగా భూసేకరణ చేయొద్దని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ పార్టీ తరపున 7వ గ్యారెంటీగా ప్రజాస్వామ్యాన్ని నిలబెడతామని సీఎం రేవంత్‌రెడ్డి హామీ ఇచ్చారని, ఆ హామీని నిలబెట్టుకోవాలని డిమాండ్ చేశారు.

లగచర్లకు వెళ్తున్న పీడీఎస్‌యూ నాయకుల బృందం బస్సును పరిగిలో నిలిపివేసిన పోలీసులు

నరేందర్‌రెడ్డి బెయిల్ పిటిషన్ విచారణ 2కు వాయిదా

- లగచర్ల రైతుల బెయిల్ పిటిషన్‌పై నేడు విచారణ

వికారాబాద్, నవంబర్ 28, (నమస్తే తెలంగాణ): లగచర్ల కేసులో కొడంగల్ మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి బెయిల్ పిటిషన్‌పై విచారణను వికారాబాద్ జిల్లా కోర్టు డిసెంబర్ 2కు వాయిదా వేసింది. 13న నరేందర్‌రెడ్డిని అరెస్ట్ చేసిన పోలీసులు రిమాండ్‌కు తరలించిన విషయం తెలిసిందే. లగచర్ల రైతుల బెయిల్ పిటిషన్‌పై విచారణను జిల్లా కోర్టు నేటికి వాయిదా వేసింది. లగచర్ల కేసులో రిమాండ్‌లో ఉన్న రైతుల్లో 21 మంది బెయిల్ పిటిషన్‌పై న్యాయవాదులు జక్కుల లక్ష్మణ్, రామచంద్రరావు వాదించారు. రైతుల అభిప్రాయం తీసుకోకుండానే భూములు ఇవ్వాలని ఒత్తిడి తెచ్చారని, కలెక్టర్‌పై దాడి జరగలేదని తెలిపినప్పటికీ రైతులపై హత్యాయత్నం కేసు నమోదు చేయడంపై కోర్టు దృష్టికి తీసుకెళ్లినట్లు న్యాయవాదులు లక్ష్మణ్, రామచంద్రరావు తెలిపారు. ఘటనలో 29 మందిని రిమాండ్‌కు తరలించారు.

ఫిరాయింపు ఎమ్మెల్యేలు ఓటింగ్‌లో పాల్గొనవద్దని ఆదేశించాలి

- హైకోర్టులో కేఏ పాల్ వాదన
- మధ్యంతర ఉత్తర్వుల జారీకి ధర్మాసనం నిరాకరణ

హైదరాబాద్, నవంబర్ 28 (నమస్తే తెలంగాణ): పార్టీ ఫిరాయించిన ఎమ్మెల్యేలు శాసనసభా వ్యవహారాల్లో జోక్యం చేసుకోకుండా, ఓటింగ్‌లో పాల్గొనకుండా ఉత్తర్వులు జారీ చేయాలంటూ ప్రజాశాంతి పార్టీ అధినేత కేఏ పాల్ చేసిన అభ్యర్థనను హైకోర్టు తోసిపుచ్చింది. అనర్హత వేటు వేయాలనే పిటిషన్లు స్పీకర్ ఎదుట విచారణలో ఉన్నాయని, తగిన సమయంలోగా ఫిరాయింపు ఎమ్మెల్యేలపై విచారణను పూర్తి చేయాలని తాము ఇటీవల ఆదేశాలు జారీ చేశామని గుర్తు చేసింది. ఈ నేపథ్యంలో పిటిషనర్ అభ్యర్థనను ఆమోదించలేమని తేల్చి చెప్పింది. స్పీకర్ నిర్ణయం తీసుకోకముందే ఫిరాయింపు ఎమ్మెల్యేలు అసెంబ్లీకి వెళ్లకుండా ఉత్తర్వులు జారీ చేయలేమని స్పష్టం చేసింది. ఈ మేరకు చీఫ్ జస్టిస్ అలోక్ అరాధే, జస్టిస్ జే శ్రీనివాస్‌రావుతో కూడిన డివిజన్ బెంచ్ గురువారం ఆదేశాలు జారీ చేసింది. బీఆర్ఎస్ తరపున గెలిచి కాంగ్రెస్‌లో చేరిన దానం నాగేందర్, బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి, కడియం శ్రీహరి, తెల్లం వెంకట్రావు, పోచారం శ్రీనివాసరెడ్డి, కాలే యాదయ్య, టీ ప్రకాశ్‌గౌడ్, ఎం సంజయ్‌కుమార్, గూడెం మహిపాల్‌రెడ్డి, అరికెపూడి గాంధీపై అనర్హత వేటు వేయాలని కోరుతూ కేఏ పాల్ ప్రజాహిత వ్యాజ్యం దాఖలు చేశారు. వ్యక్తిగత హోదాలో పిల్ దాఖలు చేసిన పాల్ వాదనలు వినిపిస్తూ, దానం నాగేందర్‌కు ఫిరాయింపులకు పాల్పడటం వెన్నతో పెట్టిన విద్యలా మారిందని పేర్కొన్నారు. గతంలో కాంగ్రెస్ నుంచి బీఆర్ఎస్‌లోకి, ఇప్పుడు బీఆర్ఎస్ నుంచి గెలిచి కాంగ్రెస్‌లోకి చేరడమే కాకుండా సికింద్రాబాద్ లోక్‌సభ సీటుకు కాంగ్రెస్ తరపున పోటీ చేశారని వివరించారు. ఇలాంటి ఎమ్మెల్యేలను కొనసాగించేందుకు వీల్లేదని, ప్రజాతీర్పును కాలరాశారని పేర్కొన్నారు. రాజ్యాంగ విరుద్ధంగా వ్యవహరించారని ఆరోపించారు. స్పీకర్ చర్యలు తీసుకోకుండా కాలయాపన చేస్తుంటే రాజ్యాంగ పరిరక్షణ బాధ్యత హైకోర్టు, సుప్రీంకోర్టులకు మాత్రమే ఉంటుందని ఈ పరిస్థితుల్లో హైకోర్టు జోక్యం చేసుకుని ప్రజాతీర్పు కాలరాసే వాళ్లను అడ్డుకోవాలని కోరారు.

రంగారెడ్డి జిల్లా షాద్‌నగర్ నియోజకవర్గ లంబాడీ హక్కుల పోరాట సమితి నూతన కమిటీ సభ్యులకు నియమాకపత్రాన్ని అందజేస్తున్న రాష్ట్ర అధ్యక్షుడు రాంబల్‌నాయక్

లంబాడీలపై దమనకాండను నిలిపివేయాలి

గురుకుల, ఆశ్రమ పాఠశాల విద్యార్థుల చావుకు ప్రభుత్వమే బాధ్యత వహించాలి

లంబాడీ హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు రాంబల్‌నాయక్

షాద్‌నగర్, నవంబర్ 28: లంబాడీలపై రాష్ట్ర ప్రభుత్వం కొనసాగిస్తున్న దమనకాండను తక్షణమే నిలిపివేయాలని లంబాడీ హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు రాంబల్‌నాయక్ డిమాండ్ చేశారు. గురువారం రంగారెడ్డి జిల్లా షాద్‌నగర్‌లో నియోజకవర్గ లంబాడీ హక్కుల పోరాట సమితి కార్యకర్తల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లగచర్ల, రోటిబండ తండా, ఇతర తండాల లంబాడీ రైతులకు సంబంధించిన భూములను ప్రైవేట్ ఫార్మా కంపెనీల సొంతం చేసేందుకు కొనసాగుతున్న ప్రయత్నాన్ని ఖండిస్తున్నట్లు చెప్పారు. తండాల్లో అర్ధరాత్రి కరెంట్ తీసివేసి గంటల తరబడి లంబాడీ ప్రజలను చిత్రహింసలకు గురి చేసి జైలుపాలు చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. తక్షణమే ఆ ప్రాంతాలకు ఫార్మా విలేజ్, సిమెంట్ ఫ్యాక్టరీలు రావని ప్రకటించాలని డిమాండ్ చేశారు. ఇండస్ట్రియల్ కారిడార్ పేరుమీద లంబాడీల భూములను స్వాధీనం చేసుకోకుండా చూడాలని, అక్రమ కేసులను ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. గురకుల, ఆశ్రమ, సంక్షేమ గురకులాల్లో నాణ్యమైన విద్యను అందించడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని విమర్శించారు. గురుకుల, ఆశ్రమ పాఠశాలల్లో చనిపోయిన విద్యార్థుల చావులకు ప్రభుత్వం బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు.

దుద్యాలలో కొత్తగా పోలీస్‌స్టేషన్

మొదటిపేజీ తరువాయి...

పంచాయతీలతో కలిపి గత ప్రభుత్వం కొత్త మండలాన్ని ఏర్పాటు చేసింది. దీంతో ఇప్పటి వరకు బొంరాస్‌పేట మండల పరిధిలోనే పోలీస్ స్టేషన్ కొనసాగేది. ప్రభుత్వ తాజా నిర్ణయంతో ఇప్పుడు దుద్యాల మండలానికి ప్రత్యేకంగా పోలీస్ స్టేషన్ ఏర్పాటు కానుంది. ఈ మండల పరిధిలో దుద్యాల, లగచర్ల, ఈర్లపల్లి, గౌరారం, చిల్‌ముల్‌మైల్వార్, నాస్కాన్‌పల్లి, హంసాన్‌పల్లి, హకీంపేట, పోలెపల్లి, కుదురుమల్ల, ఆలేడ్‌తోపాటు హుస్నాబాద్ గ్రామాలతో కొత్తగా దుద్యాల పోలీస్ స్టేషన్ ఏర్పాటు కానున్నట్టు తెలిసింది.

మరిన్ని వార్తలు ntnews.com లో చూడగలరు

TATA INSTITUTE OF FUNDAMENTAL RESEARCH, HYD
(A Deemed to be University)
Sy.No. Gopanpally Village, Serilingampally Mandal, Ranga Reddy District, Hyderabad, Telangana-500 046
Advertisement No. 2024/05
Applications are invited for Admission to TIFR, Hyderabad under the Subject Board of Chemistry
Ph.D. & Integrated M.Sc.-Ph.D. Programmes
Starting from January 2025
No. of Vacancies: 02 (Ph.D / IPh.D)
For application procedure & to apply online, please visit
https://gsadmissions.tifrh.res.in
or write to Academic Coordinator Email: gsadmissions@tifrh.res.in
The last date for submitting online applications is 15 December, 2024